నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 8 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

డిప్యూటీ సీఎం భట్టి పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భట్టివిక్రమార్క దంపతులు, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా రూరల్, జనవరి 7: మల్లు భట్టివిక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి తొలి సారి ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి విచ్చేశారు. వారికి ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో పాటు గ్రామస్తులు స్వాగతం పలికారు. గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం తల్లిదండ్రులు అఖిలాండేశ్వర్‌రావు, మాణిక్యమ్మ, సోదరుడు అనంతరాములు సమాధుల వద్ద నివాళి అర్పించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

భద్రాద్రి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

చర్ల, జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు డిమాండ్ చేశారు. చర్లలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం చర్లకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ధనికొండ చిన్నారి తల్లి మృతిచెందిందని తెలుసుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రేషన్ ఈ-కేవైసీకి త్వరపడండి!

ఖమ్మం నగరానికి చెందిన సుబ్రహ్మణ్యం(పేరు మార్పాం)అనే వృద్ధుడికి చాలా ఏళ్ల నుంచి రేషన్‌కార్డు ఉంది. ఆయన కాలం చేసి నాలుగు సంవత్సరాలైంది. ఆయన చనిపోయినప్పటికీ అతడి కుటుంబం నెల నెలా రేషన్ బియ్యం తీసుకుంటున్నది. ఇలా రేషన్ బియ్యం దుర్వినియోగం అవుతూనే ఉన్నది.

రఘునాథనాపాలెం మండలంని బల్లేపల్లికి చెందిన ముస్తాఫా (పేరు మార్పాం) చనిపోయి ఎనిమిదేళ్లైంది. ఆయన పేరుపై ప్రతి నెలా ఆయన కుటుంబ సభ్యులు రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. రేషన్ డీలర్ ఒక నెల బియ్యం ఇవ్వకపోతే ఆన్‌లైన్‌లో ఆహార భద్రత కార్డు ప్రింట్ తీసుకువచ్చి 'మా నాన్నకు వచ్చిన కోటా బియ్యం ఎందుకు ఇవ్వడం లేదు..' అని డీలర్‌ను ప్రశ్నిస్తున్నారు.

..ఇలా ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత రేషన్ బియ్యం తీసుకుంటున్న కుటుంబాలు ఖమ్మం జిల్లావ్యాప్తంగా వేలాదిగా ఉన్నాయి. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. మృతిచెందిన వారి కార్డులు, స్వగ్రామాల నుంచి మరో ఊరికి వెళ్లిపోయిన వారి పేర్లు, వివాహమై ఇతర గ్రామాలకు వెళ్లినవారి పేర్ల తొలగింపు ప్రక్రియ జరగలేదు. ఈ లోపాన్ని ఆసరా చేసుకుని ఎంతోమంది కుటుంబ సభ్యులు నెల నెలా రేషన్ పొందుతున్నారు. ఇది గమనించిన కేంద్ర ప్రభుత్వం ఈ-కేవైసీ విధానాన్ని ప్రవేశపెట్టింది. బోగస్ రేషన్ కార్డులు ఏరివేయాలనే ఉద్దేశంతో ప్రక్రియను ప్రారంభించింది.

- ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు
- కార్డులో పేరున్న ప్రతి వ్యక్తీ డీలర్ వద్దకు వెళ్లాల్సిందే.. ప్రక్రియ పూర్తి చేయాల్సిందే..
- ఖమ్మం జిల్లావ్యాప్తంగా 69.75 శాతం మాత్రమే పూర్తి

ఖమ్మం, జనవరి 7: రేషన్‌కార్డుదారులు ఈ -కేవైసీ చేయించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ నుంచి కూడా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆహార భద్రత కార్డులో పేరు ఉన్న ప్రతి సభ్యుడు రేషన్ డీలర్ వద్ద మాత్రమే ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రక్రియ ప్రారంభం కాగా కేంద్రం డిసెంబర్ 31 వరకు గడువు విధించింది. ప్రక్రియ పూర్తి చేసుకోని వారి కోసం కేంద్రం ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించింది. ఖమ్మం జిల్లాకు చెందిన రేషన్‌కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాలశాఖ అధికారులు సూచిస్తున్నారు.

రేషన్ తగ్గించే కుట్రలకు తెరదీసిన కేంద్రం..?

రేషన్ కార్డులో పేరు ఉన్న వ్యక్తులు ప్రతిఒక్కరూ రేషన్ దుకాణానికి వచ్చి డీలర్ వద్దనున్న ఈ పాస్ మెషన్‌లో ఈ-కేవైసీ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ-కేవైసీ పూర్తయితే పారదర్శకంగా రేషన్ పంపిణీ ఉంటుందని కొందరు అభిప్రాయపడుతుంటే, మరోవైపు ఈ ప్రక్రియ ద్వారా కేంద్రం భారీ మొత్తంలో రేషన్ కార్డులు ఎత్తివేసే కుట్ర చేస్తున్నదని పలువురు పేర్కొంటున్నారు. బతుకు దెరువు కోసం, ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు వ్యయప్రయాసాలతో ఈ-కేవైసీ కోసం సొంత గ్రామాలకు రావాల్సి వస్తున్నదంటున్నారు.

జిల్లావ్యాప్తంగా ఈ-కేవైసీ ఇలా..

జిల్లావ్యాప్తంగా 748 రేషన్ దుకాణాలు ఉండగా వీటి పరిధిలో 4,11,347 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ఆయా రేషన్ కార్డుల్లో 11,32,871 మంది పేర్లు ఉండగా ఇప్పటివరకు కేవలం 7,90,161 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారు. అంటే 69.75శాతం మంది మాత్రమే ప్రక్రియ ఇంకా 3,42,710 మంది సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోలేదు.

ఈ కేవైసీకి అడ్డంకులు ఇవీ..

రేషన్‌కార్డుల్లో పేరు ఉండి ఆధార్ అప్‌డేషన్ చేసుకోని వారి ఈ కేవైసీలు నిలిచిపోతున్నాయి. వారంతా తిరిగి ఆధార్ కేంద్రాలకు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేయించుకునే పనిలో ఉండడంతో ఈకేవైసీ మరింత ఆలస్యమవుతున్నది. ఈ నెల 31లోపు రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని, లేకపోతే రేషన్‌కు దూరమయ్యే పరిస్థితి ఉంది.

రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

గోటి తలంబ్రాల వడ్లను మద్ది ఆంజనేయ స్వామివారి ఆలయం వద్దకు తీసుకు వస్తున్న దేవస్థానం ఈఓ ఎల్ రమాదేవి, ఆంజనేయ స్వామివారి దేవస్థానం భక్తులు

భద్రాచలం, జనవరి 7: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలోని మూలమూర్తులకు ఆదివారం అర్చకులు సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు నిర్వహించారు. నిత్య బలిహరణం చేపట్టారు. 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. మూలవరులను అభిషేకించారు. అనంతరం నిత్య కల్యాణ మూర్తులను చిత్రకూట మండపంలోకి తీసుకొచ్చి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణదాతలకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

భద్రాద్రికి చేరుకున్న జంగారెడ్డిగూడెం భక్తులు..

ఏప్రిల్ 17న జరిగే శ్రీరామనవమికి గోటి తలంబ్రాలు ఒలిచేందుకు ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయ ఆలయ నిర్వాహకులు, భక్తులు భద్రాద్రి రామాలయానికి వడ్లను తీసుకొచ్చారు. వారికి ఆలయ ఈవో రమాదేవి స్వాగతం పలికారు. అర్చకులు ఆంజనేయస్వామి ఆలయం వద్ద వడ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ ఏఈవో భవానీరామకృష్ణ, వేద పండితులు లింగాల ప్రసాద్‌శర్మ, ఎస్టీజీ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ఈ నెలలో పుష్య మాసోత్సవాలు

భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పుష్య మాసం సందర్భంగా ఈ నెల 12న అర్చకులు 'కూడారై' పాశురోత్సవం, 108 కలశాలతో పాయసం నివేదన, తిరువీధి సేవ, 13న కరవైగళ్ సందర్భంగా ఆండాళ్ అమ్మవారికి తిరువీధి సేవ, 14. భోగి పండుగ, తిరువీధి సేవ, గోదాదేవి తిరు కల్యాణోత్సవం, ధనుర్మాసోత్సవాలు ముగింపు, 15న మకర సంక్రాంతి సందర్భంగా రథోత్సవం, ప్రణయ కలహోత్సవం, 19న శుక్రవారం సందర్భంగా స్వామివారికి సంధ్యాహారతి, చుట్టు సేవ నిర్వహిస్తారు. 21న సర్వ ఏకాదశి సందర్భంగా తిరువీధి సేవ, చుట్టు సేవ, పవళింపు సేవ ఉండదు. 25న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, పునర్వసు పూర్ణిమ తిరువీధి సేవ ఉంటుంది. 26న పుష్యమి నక్షత్రం సందర్భంగా అర్చకులు రామయ్యకు పట్టాభిషేకం నిర్వహిస్తారు. 27 నుంచి 31 వరకు శ్రీకూరత్తాళ్వార్ తిరు నక్షత్రోత్సవాలు కొనసాగుతాయి. 28న కూరాత్తాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా అర్చకులు ఆళ్వార్‌కు తిరుమంజనం, రాత్రి విశేష భోగ (మధుర పదార్థం) నివేదన, 31న కూరత్తాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ప్రబంధారంభం, తిరుమంజనం, ఆళ్వార్‌కు చుట్టు సేవ, విశేష భోగ నివేదన చేస్తారు. ఫిబ్రవరి 1న చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం నిర్వహిస్తారు.

మే నెలాఖరు కల్లా సీతారామ కాలువల పనులు పూర్తి చేయాలి

ప్రాజెక్ట్‌పై మంత్రులు తుమ్మల,పొంగులేటి, తుమ్మల ఉన్నతస్థాయి సమీక్ష

సమీక్షలో మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఖమ్మం, జనవరి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మే నెలాఖరు కల్లా సీతారామ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని కాలువల పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిపై ఆదివారం హైదరాబాద్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి నీటి పారుదలశాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల్లో వేగం పెంచితే ఈ ఏడాదిలోనే వైరా రిజర్వాయర్, లంకాసాగర్ చెరువు, ఎన్నెస్సీ ఆయకట్టులోని సుమారు 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. ఏన్కూరు వద్ద లింకు కెనాల్ పనులకు టెండర్లు పూర్తి చేసి, పనులు మొదలుపెట్టాలన్నారు. యాతాలకుంటలో భూసేకరణ పూర్తయితే సత్తుపల్లి టన్నెల్ ద్వారా లంకసాగర్, బేతుపల్లి కెనాల్‌కు ఈ సీజన్‌లో సాగునీరు ఇవ్వొచ్చన్నారు. సత్తుపల్లి కెనాల్‌కు సంబంధించి భూసేకరణకు రూ.12 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పాలేరు టన్నెల్ పనులనూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తయితే పాలేరు రిజర్వాయర్‌కూ జలాలు తీసుకురావొచ్చన్నారు.

తాగునీటి అవసరాలపైనా సమీక్ష..

కూసుమంచి, జనవరి 7: తగ్గిన పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం, సాగర్ జలాల రాక, రిజర్వాయర్‌పై ఆధారపడిన తాగునీటి అవసరాలపై హైదరాబాద్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్‌శాఖ ఈఎన్సీ మురళీధర్‌రావుతో కలిసి సమస్యల పరిష్కారంపై చర్చించారు. ప్రస్తుతం సాగర్‌లో ఫిబ్రవరి మొదటి వారం వరకు మాత్రమే జలాలు ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలపై సమాలోచనలు చేశారు. మిషన్ భగీరథకు నీటికొరత లేకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఖమ్మం చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా సింగరేణి సోలార్

సంయుక్త భాగస్వామ్యంలో ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రణాళికలు

థర్మల్, సోలార్ ప్లాంట్లపై సంస్థ సీఎండీ బలరాం సమీక్ష

మాట్లాడుతున్న సీఎండీ బలరాం

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 7 (నమస్తే తెలంగాణ): సింగరేణి బొగ్గు ఉత్పత్తి పాటు విజయవంతంగా థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలోనూ అడుగుపెట్టిందని, అలాగే దేశ వ్యాప్తంగా సోలార్ రంగంలో ఉండే అవకాశాలను అందిపుచ్చుకోవాలని సంస్థ సీఎండీ బలరాం పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆదివారం థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించే క్రమంలో ఇతర రాష్ట్రాల్లోనూ సోలార్ ప్రాజెక్టులు నిర్మించాలని సూచించారు. రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో సోలార్ రంగంలోకి అడుగుపెట్టేందుకు అధ్యయనం చేయాలన్నారు. అవసరమైతే సంయుక్త భాగస్వామ్య ప్రాజెక్టులనూ స్వాగతించాలన్నారు. మొదటి దశలో నిర్దేశించుకున్న 300 మెగావాట్ల సోలార్ ప్లాంట్లలో మిగిలి ఉన్న 76 మెగావాట్ల ప్లాంట్లను మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో దశలో కంపెనీవ్యాప్తంగా 232 మెగావాట్ల ప్లాంట్లను చేపడుతున్నట్లు డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు వివరించారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణ రావు (ఈ అండ్ఎం), ఎన్వీకే శ్రీనివాస్ (ఆపరేషన్స్), వెంకటేశ్వర్‌రెడ్డి (పీపీ), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సీఎం) జె.ఆల్విన్, జీఎం కో-ఆర్డినేటర్ ఎం.సురేశ్, జీఎం సీపీపీ జక్కం రమేశ్, జీఎం ఎంపీ మల్లెల సుబ్బారావు, జీఎం ఎస్టేట్స్ సురేశ్, జీఎం మార్కెటింగ్ దేవేందర్, జీఎం సివిల్ సూర్యనారాయణ, కార్పొరేట్ జీఎంలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో కొత్త గనులకు శ్రీకారం

ఈ ఏడాది సింగరేణిలో ప్రారంభించే నాలుగు కొత్త గనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరికొన్ని బొగ్గు బ్లాకులను ప్రారంభిస్తామని సంస్థ సీఎండీ బలరాం స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆదివారం కొత్త గనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. నిర్దేశిత గడువులోపు పనులు పూర్తయేయేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఏరియాల జీఎంలను ఆదేశించారు. ఒడిశా నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించి ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. చివరి దశ అనుమతులకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకొని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో చర్చించేందుకు ఈ నెల మూడో వారం భువనేశ్వర్ వెళ్తారని స్పష్టత ఇచ్చారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కంపెనీ స్థాయి క్రికెట్ లీగ్ ఫైనల్ మ్యాచ్

బ్యాటింగ్ చేసిన సీఎండీ బలరాం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఎండీ బలరాం

రామవరం, జనవరి 7 : సింగరేణి కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ ఆదివారం ఫైనల్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌ను నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఎండీ బలరాం ప్రారంభించారు. చైర్మన్ 11, డైరెక్టర్స్ 11 మధ్య జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో డైరెక్టర్స్ 11 టీమ్ మొదట బ్యాటింగ్ చేసి 10 ఓవర్లకు 57 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని చైర్మన్ 11 టీం ఛేదించింది. డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర జీఎంలతో కలిసి ఆడారు. మూడో ప్లేస్ రామగుండం రీజియన్, కార్పొరేట్ మణుగూరు ఏరియా టీమ్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కార్పొరేట్, మణుగూరు ఏరియా టీం గెలుపొందింది. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలి

గనిలో పర్యటిస్తున్న సంస్థ సీఎండీ బలరాం

టేకులపల్లి, జనవరి 7: సింగరేణి ఇల్లెందు ఏరియా సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అధిగమించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆదేశించారు. ఆదివారం ఆయన కోయగూడెం ఉపరితల గనిని సందర్శించి ఏరియా అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. వ్యూపాయింట్ నుంచి క్వారీలో చేపడుతున్న ఓబీ తొలగింపు, బొగ్గు వెలికితీత పనులను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాపై ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను ఆరా తీశారు. పర్యటనలో సంస్థ డైరెక్టర్ (పీపీ) జి.వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, సేఫ్టీ జీఎం గురవయ్య, జీఎం సెక్యూరిటీ దీక్షితులు, ప్రాజెక్ ఆఫీసర్ ప్రహ్లాద్, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల రక్షణకు పటిష్ట చర్యలు

అధికారులను ఆదేశించిన కలెక్టర్ వీపీ గౌతమ్

ఖానాపురంలో ప్రభుత్వ భూమిగా గుర్తించి ఫెన్సింగ్ వేసిన అధికారులు

రఘునాథపాలెం, జనవరి 7 : ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అభ్యంతరం లేని భూముల క్రమబద్ధీకరణకు జారీ చేసిన జీవో నెం 59క్రింద నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి నిర్మాణాలు లేకున్నా ధరఖాస్తు చేసి అక్రమంగా క్రమబద్ధీకరణ కోసం ప్రయత్నం చేసిన స్థలాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ పరిధిలోని ఖానాపురం సర్వే నెం.272లో 300గజాల ప్లాట్, ఖానాపురం డొంకలో 200గజాల రెండు ప్లాట్లు, 150గజాల మరో ప్లాట్, వెలుగుమట్ల సర్వే నెంబర్ 412లో 300గజాల ప్లాట్‌లు ఎలాంటి నిర్మాణాలు లేకుండా క్రమబద్ధీకరణకు జీవో 59క్రింద దరఖాస్తులు చేశారన్నారు. వాటిని తిరస్కరించడం జరిగిందన్నారు. సుమారు రూ.4.35కోట్ల విలువైన స్థలాలను రెవిన్యూ, మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా అభవిశ్యత్తులో ఆక్రమణలు జరగకుండా ససీ కెమేరాల ఏర్పాటుకు అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. రెవిన్యూ, మున్సిపల్ సిబ్బంది నిఘా పెట్టి ఎలాంటి ఆక్రమణలు జరగకుండా, నిర్మాణాలు చేపట్టకుండా పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం : ఎమ్మెల్యే

క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి టౌన్, జనవరి 7 : సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో క్రీడల అభివృద్ధికి యువతకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లిలో వీఆర్ క్రికెట్‌బాక్సును ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత యువతలోని నైపుణ్యాలను అభివృద్ధి పర్చడానికి ఇలాంటి ఆడిటోరియంల అవసరం ఎంతైనా ఉందన్నారు. వీఆర్ క్రికెట్ బాక్సును ఏర్పాటు చేసిన జనకనూరి విరించిని అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను జనకనూరి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సింగరేణి వోసీ పీవో వెంకటాచారి, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నకేశవరావు, కమల్‌పాషా, గోలి శ్రీనివాసరెడ్డి, పింగలి సామ్యేలు, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జ్యోతీబాపూలే విద్యార్థులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రఘునాథపాలెం, జనవరి 7: రాష్ట్రస్థాయి రగ్బీ అండర్-14 విభాగం పోటీలకు రఘునాథపాలెంలోని చెరువుమాధారం మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో జెసికా, మైత్రి, మహేశ్వరి, వేదశ్రీ, మహేశ్వరి ఉన్నారు. వారిని ప్రిన్సిపాల్ విద్యాధరి, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

తొలిరోజు 66,292 దరఖాస్తులు ఆన్‌లైన్

దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీల పథకాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారంతో ముగియడంతో ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఆన్‌లైన్ ప్రక్రియ ఈ నెల 17కల్లా పూర్తిచేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించడంతో ఆదివారం సెలవు అయినప్పటికీ పంచాయతీ కార్యదర్శులు, టీం సభ్యులు పనిచేశారు. జిల్లావ్యాప్తంగా ఒక్కరోజులోనే 66,292 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. మొత్తంగా 3,33,370 దరఖాస్తులు రాగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అత్యధికంగా జిల్లాలో ఒక్క రోజే టేకులపల్లి మండలం అధికారులు 4,188 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో నాలుగు మున్సిపాలిటీల్లో తొలిరోజు 8,828 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు.